
సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం। 7। అక్టోబర్। 2024



ఘరానా దొంగ అరెస్టు

రాజంపేటలో ఓ ఘరానా దొంగను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.6,93,800 విలువ చేసే బంగారు స్వాధీనం చేసుకున్నారు. -8లో



హార్సిలీహిల్స్ వస్తున్నారా.. జేబుకు చిల్లే!

పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను వీక్షించేందుకు వచ్చే సందర్శకులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.820	రూ.880
రెండోరకం	రూ.700	రూ.800

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	536
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 66.660 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కార వేదిక కార్యక్రమంలో విన్నవించుకోవాలని ఆయన సూచించారు.

మద్యంషాపుల లాటరీకి సర్వం సిద్ధం




మాట్లాడుతున్న ఈఎస్ మధుసూదనరావు, సీఐ మల్లిక

రాజంపేట: జిల్లాలో మద్యంషాపుల లాటరీ నిర్వహణకు సంబంధించి సర్వంసిద్ధం చేసామని, దరఖాస్తుపై ఆసక్తిగలవారికి అవగాహన కల్పించడం జరుగుతోందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ మధుసూదనరావు వెల్లడించారు. ఆదివారం స్థానిక అబ్కారీశాఖ కార్యాలయంలో సీఐ మల్లికతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానంను తీసుకు వచ్చిందన్నారు. ఈవిధానంపై మద్యంషాపు కావాలనుకునేవారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మద్యంపాలసీ ప్రకారంగానే జిల్లాలో అమలు చేస్తామన్నారు. జిల్లాలో 111 మద్యంషాపులకు అనుమతి లభించిందన్నారు. ఈ నెల11న లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామన్నారు. 12వ తేదీ నుంచి షాపులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఏదైనా గుర్తింపు కార్డు, ఫోటో, రూ.2 లక్షలతో ఆన్‌లైన్‌లోగానీ, ఎక్సైజ్ కార్యాలయంలోగానీ మద్యం షాపునకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. షాపు యజమానికి 20 శాతం కమిషన్ వస్తుందన్నారు. పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. అపోహలు నమ్మవద్దన్నారు. కచ్చితంగా ప్రభుత్వ నియమ, నిబంధలనకు అనుగుణంగా మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. లాటరీ విధానం రాయచోటిలోని పీలేరు రోడ్డు లయగార్డెన్స్, పుష్పమి గ్రూప్ ఆఫ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 11 ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ డిప్ తీయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 9 లోపు మద్యంషాపులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.2లక్షలు ఎంట్రీ డిపాజిట్ అన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాగితాలకే ఇళ్ల లెక్కలు..!

- మొదటి వంద రోజుల 4,840 ఇళ్లకే దిక్కులేదు
- రెండో విడత వంద రోజుల లక్ష్యం 7,374 ఇళ్లు
- మార్చి తర్వాత ఇళ్లకు కేంద్రం పైసా ఇవ్వదు
- అయినా నిర్మాణాలపై హౌసింగ్ మీనమేషాలు
- ఇంజనీరింగ్ అసిస్టెంట్లు - హౌసింగ్ మధ్య సమన్వయ లోపం



బి.కొత్తకోట కురవానికుంట లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

బి.కొత్తకోట: నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పక్కా ఇళ్లకు వచ్చే మార్చి తర్వాత కేంద్రం నిధులు నిలిపివేస్తుందని ఈలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశిస్తున్నా అధికారులు లక్ష్య పెట్టడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో పూర్తి చేయాల్సిన ఇళ్ల లక్ష్యాలను ఇచ్చి అక్టోబర్ రెండు నాటికి వంద రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించింది. జిల్లాలో 4,840 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని నిర్దేశించగా అధికారులు కేవలం ప్రచారం, మొక్కబడి సమావేశాలకే పరిమితం కావడంతో లక్ష్యాలు పడకేశాయి. ప్రభుత్వం మరోసారి వంద రోజుల గడువు లక్ష్యాలను ఇచ్చింది. 7,374 ఇళ్లను డిసెంబర్ 31 లోగా పూర్తి చేయాలని లక్ష్యం ఇచ్చింది.

వంద రోజులు అపహాస్యం

జిల్లాలో వంద రోజుల్లో పూర్తి చేయాల్సిన ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు. లేఅవుట్లకు ప్రత్యేకంగా అధికారులను నియమించారు. హౌసింగ్, ప్రత్యేక అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి నిర్మాణాల పూర్తికి కృషి చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. వంద రోజుల్లో పూర్తి చేయించాల్సిన ఇళ్లలో కేవలం 1,769 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇచ్చిన లక్ష్యంలో ఇంకా 3,071 ఇళ్లు పూర్తి కాలేదు. దీనితో ప్రభుత్వం వంద రోజుల్లో ఇళ్ల నిర్మాణాల పూర్తి ప్రచారానికే పరిమితమైపోయింది.

ఇంకో 7,374 ఇళ్లు..

మొదటి విడత వందరోజుల కార్యక్రమం విఫలమైంది. ఇచ్చిన లక్ష్యం నెరవేరలేదు. అయినా గత లక్ష్యాల నిర్లక్ష్యంపై దృష్టి పెట్టి సమీక్షించని ప్రభుత్వం రెండో విడత వంద రోజుల కార్యక్రమం అమలు చేసింది. డిసెంబర్ 31 నాటికి జిల్లాలో 7,374 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖకు టార్గెట్ ఇచ్చింది. జిల్లాలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీ పరిధిలో ఇళ్ల లక్ష్యాలను కేటాయించారు. ఈ మేరకు అధికారులు నిర్మాణాల పూర్తికి కృషి చేయాల్సి ఉంది. ఈ లక్ష్యమైనా నెరవేరుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకమే. మొదటి విడత వందరోజుల కార్యక్రమంలో సాధించిన ఫలితాలే రెండో విడత కార్యక్రమంపై ప్రభావం చూపితే లబ్ధిదారులు పనులు పూర్తి చేయడం అసాధ్యం అవుతుంది.

నిధులు రావని తెలిసినా..

ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం నుంచి నిధులు అందుతున్నాయి. పీఎంఏవై కింద పేదలు నిర్మించుకొంటున్న ఇళ్లకు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. ప్రస్తుతం నిర్మాణంలోని ఇళ్లకు వచ్చే ఏడాది మార్చి తర్వాత కేంద్రం నిధులు ఇవ్వదు. ఇదే విషయాన్ని ప్రభుత్వం జిల్లా అధికారులకు పంపిన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఈ నిధులు సద్వినియోగం చేసుకునేలా హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల్లో అవగాహన కల్పించే విషయంలో విఫలమయ్యారు. దీనితో లబ్ధిదారులు పనులు వేగవంతం చేయలేకపోతున్నారు. నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోతే లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతారు. అసంపూర్తి ఇళ్లుగా మిగిలిపోతాయి. నిధులను సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తే ఫలితం ఉంటుంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది కేవలం ఇంటి స్థాయి నమోదుకు మాత్రమే పరిమితమైపోయారు. క్షేత్రస్థాయిలో పర్యటించి లబ్ధిదారులకు అండగా నిలవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కీలకం..

ఇళ్ల నిర్మాణాల విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత ఇచ్చింది. వీరి నుంచే ఇళ్ల నిర్మాణ బాధ్యతలు మొదలవుతాయి. మొదట లబ్ధిదారులకు చేరువ అయ్యేది వీరే. లేఅవుట్లలో పర్యటించడం, లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులు పర్యవేక్షణ, బిల్లుల చెల్లింపునకు వెబ్‌సైట్‌లో ఇళ్ల స్థాయి నమోదుకు చర్యలు తీసుకోవాలి. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాల్లో కదలిక తెచ్చేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది, అధికారులు, ప్రత్యేకఅధికారులు సమన్వయంతో కృషి చేస్తేకాని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితులు లేవు.

జూన్ 3 నాటికి ఇళ్ల నిర్మాణాలు

- చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు: 75,619
- ప్రారంభంకానివి: 1,123
- బిలో బేస్‌మెంట్ లెవల్: 9,748
- ప్లీంత్‌భీం: 349
- బేస్‌మెంట్ లెవల్: 19,578
- లింటిల్ లెవల్: 856
- రూఫ్ లెవల్: 6151
- రూఫ్‌కాస్ట్: 4745
- పూర్తయినవి: 33069

అక్టోబర్ 5 నాటికి ఇళ్ల స్థితి

- చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు: 79,721
- ప్రారంభంకానివి: 4,301
- బిలో బేస్‌మెంట్ లెవల్: 10,452
- బేస్‌మెంట్ లెవల్: 19,302
- లింటిల్, రూఫ్ లెవల్: 6,720
- రూఫ్‌కాస్ట్: 3,211
- పూర్తయినవి: 34,838

లక్ష్య సాధనకు కృషి

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై రెండో విడతలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే లేఅవుట్లలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాం. డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తి చేయకుంటే బిల్లుల చెల్లింపు ఆగిపోతాయని లబ్ధిదారులకు తెలియజేస్తున్నాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు పరిశీలిస్తూ సూచనలు చేస్తున్నాం. – వెంకటదాస్, హౌసింగ్ ఈఈ, మదనపల్లి



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా 'రాచమల్లు'



రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల్లో మంచి వక్తగా పేరొందిన రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని అధికార ప్రతినిధిగా నియమించడం ద్వారా వైఎస్సార్ సీపీకి మేలు జరిగే అవకాశం ఉందని పార్టీ నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు.

ధరల దడ

- సలసలా కాగుతున్న నూనె
- అమాంతం పెరిగిన కిరాణా సరుకుల ధరలు
- సామాన్యుడి జీవనం భారం



రాయచోటి: నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యుడు విలవిలలాడుతున్నాడు. నూనె, కందిపప్పు, శనగ పప్పు.. తెల్లగడ్డలు.. ఇలా ప్రతీ వాటి ధర పెరిగాయి. దీనికితోడు కూరగాయల ధరలు మేమేమీ తక్కువ కాదంటూ పెరిగాయి. దీంతో రోజువారీ కూలీ పనులు చేసుకునే వారు, పేద వర్గాలతో పాటు మధ్య తరగతి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. దసరా పండుగను సంతోషంగా జరుపుకుందామంటే ఈ ధరలు దడ పుట్టిస్తున్నాయని పేదలు వేదన చెందుతున్నారు. ప్రభుత్వం ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు తగ్గి.. ధరలు పెరిగి: సాగు తగ్గడంతో కూరగాయల ధరలపై అధిక ప్రభావం పడుతోంది. సకాలంలో వర్షాలు లేకపోవడంతో జిల్లాలో కూరగాయల సాగు భారీగా పడిపోయింది. జిల్లాలో టమోటా ఇతర కూరగాయల సాగు రాష్ట్రంలోనే రెండు మూడు స్థానాలను నమోదు చేసుకుంటుంది. సాధారణంగా 30 వేల హెక్టార్లకు పైగా కూరగాయల పంటలు సాగు కావాల్సి ఉండగా పది వేల హెక్టార్లకు సాగు పడిపోయింది. దీంతో ఈ ప్రభావం ధరలపై పడుతోంది.

నెల రోజుల్లోనే పెరిగిన ధరలు ఇలా..

- వేరు శనగ నూనె లీటర్ రూ.115 నుంచి రూ.140
- పామ్ ఆయిల్ లీటర్ రూ.100 నుంచి రూ.130

కిరాణా సరుకుల ధరలు (కిలో)

	గతంలో	ఇప్పుడు
తెల్లగడ్డ	రూ.220	రూ.420
కందిపప్పు	రూ.140	రూ.170
శనగపప్పు	రూ.89	రూ.130
శనగపిండి	రూ.100	రూ.130
ఉల్లిగడ్డ	రూ.40	రూ.80
శనగలు	రూ.70	రూ.90
శనిగ గింజలు	రూ.110	రూ.130
కొబ్బరికాయ	రూ.20	రూ.30
నువ్వులు	రూ.145	రూ.190

కూరగాయలు	కిలో
టమోటా	రూ.80
బెండ	రూ.50
మిరప	రూ.40
వంకాయ	రూ.50
అనప	రూ.60
అలసంద	రూ.60
ఉల్లగడ్డ	రూ.60



ధరలు నియంత్రించాలి..

నిత్యావసర సరుకుల, కూరగాయల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి, చిన్న ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. పెరుగుతున్న వంట సరుకులు, నూనెలు, కూరగాయల ధరలను ప్రభుత్వం నియంత్రణ చేయాలి. – జి.చెన్నారెడ్డి, ప్రజా చైతన్య సేవా సంఘం, రాయచోటి

మాతా.. అన్నపూర్ణేశ్వరీ..



అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్: మాతా... అన్న పూర్ణేశ్వరి అంటూ భక్తులు అమ్మవారిని శరణు వేడారు. దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో నాలుగో రోజైన ఆదివారం శ్రీవాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర విగ్రహాలు, వివిధ దేవతా మూర్తులు, వివిధరకాల తినుబండారాలు అమ్మవారి చెంత ఉంచారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, గౌరమ్మ కట్టలో అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనం ఇచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులకు గజలక్ష్మీదేవిగా, శివాలయంలో, సూపర్ బజార్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శారదాదేవిగా భక్తులకు అగుపించారు. అలాగేజిల్లాలోని అన్ని దేవీ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



కడప: కూష్మాండ అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

లాభాల పుట్ట.. ఆరోగ్యానికి గొడుగు

- చిరు పెట్టుబడి... అధిక రాబడి
- ఉపాధి పొందుతున్న పలువురు మహిళలు, యువకులు
- నెలకు రూ.8 నుంచి రూ.20 వేలు ఆదాయం పొందుతున్న కుటుంబాలు



పుట్టగొడుగుల పెంపకంపై సూచనలు ఇస్తున్న సైంటిస్టు శిల్పకళ



దిగుబడికి వస్తున్న పుట్టగొడుగులు

కడప అగ్రికల్చర్: పుట్ట గొడుగుల పెంపకం చిరు కుటుంబాలకు ఆసరాగా మారింది. తక్కువ పెట్టుబడితోనే అధిక ఆదాయమిచ్చే కుటీర పరిశ్రమగా నిలుస్తోంది. పైగా నెలనెలా ఆదాయం లభిస్తుండడంతో జిల్లాలోని నిరుద్యోగ యువత, మహిళలు ఇప్పుడు పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. వీరికి వైఎస్ఆర్ జిల్లాలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా మహిళలు పుట్ట గొడుగుల యూనిట్లు పెట్టి ఉపాధిని పొందుతూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

స్థానికంగానే పుట్టగొడుగుల పెంపకం...

పుట్టగొడుగుల (మిల్క్ మష్రూమ్) పెంపకానికి సంబంధించిన విత్తనాలను సాగుదారులు హైదరాబాదు, బెంగళూరు, ఒంగోలు ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. కిలో విత్తనం రూ. 100లతో తెచ్చుకుంటారు. మరో రూ.300 ఖర్చు చేసి సాగు చేసుకుంటారు. 21 రోజుల నుంచి 30 రోజుల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుంది. ఒక కిలో విత్తనానికి 5 కిలోలపైనే దిగుబడి వస్తుందని సాగుదారులు తెలిపారు. ఐదు కిలోలు కిలో 300 చొప్పున అమ్ముకుంటే రూ. 15 వందలదాకా రాబడి వస్తుందని వారు తెలిపారు. ఒక కిలోకు విత్తనం, ఖర్చు పోను వెయ్యి రూపాయల వరకు ఆదాయం ఉంటుందని వారు తెలిపారు. ఇంటివద్దే కుటీర పరిశ్రమగా 5 కిలోల నుంచి 20 కిలోల వరకు సాగు చేసుకుంటూ రాబడిని పొందుతున్నారు. తక్కువ స్థలంలో తక్కువ రోజుల్లో ఎక్కువ ఆదాయం వస్తుండటంతో నేడు చాలామంది పుట్టగొడుగుల పెంపకంపై దృష్టి సారిస్తుండడం విశేషం.

కేవీకేలో 2019లో....

కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల ఉత్పత్తి యూనిట్‌ను 2019లో స్థాపించారు. అప్పటి నుంచి గ్రామీణ యువతకు స్వయం ఉపాధి అవకాశాల కోసం మష్రూమ్ పెంపకంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 4 వేల మంది శిక్షణను పూర్తి చేసుకున్నారు. శిక్షణ తీసుకున్న వారు వారివారి ఆసక్తిని బట్టి పుట్టగొడుగుల పెంపకాన్ని నిర్వహించుకుంటూ కుటుంబ పోషణను సాగించుకుంటున్నారు.

45 యూనిట్లు ఏర్పాటు...

జిల్లాలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొందిన వారిలో 45 మంది సాంకేతిక సహకారంతో మష్రూమ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటి నిర్వహణ ద్వారా నెలకు రూ. 8 వేల నుంచి రూ.20 వేల ఆదాయాన్ని ఆర్జిస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

పుట్టగొడుగుల వల్ల ఉపయోగాలు

పుట్టగొడుగులలో వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ప్రోటీన్స్ (12–35 శాతం) ఉంటాయి.


- పుట్టగొడుగుల్లో 80–90 శాతం నీరు. 8–10 శాతం పీచు పదార్థాలు ఉంటాయి
- కొవ్వు పదార్థాలు ఉండవు.
- పొటాషియం, సోడియం, ఫాస్పరస్, కాపర్‌లతోపాటు ఐరన్‌లు అధికంగా ఉంటాయి.
- విటమిన్ సి, బి అధికంగా ఉంటాయి, పిండి పదార్థాలు తక్కువగా ఉంటాయి.
- ముఖ్యమైన అమైనో ఆమ్లాలు, త్రియోనిన్, మాలిన్ అధికంగా లభ్యమవుతాయి.
- పుట్టగొడుగులు హైపో లిపిడెమిక్, హైపో కొలెస్టరమిక్, హైపర్ టెన్షన్ లాంటి జబ్బులకు ఔషధాలుగా ఉపయోగపడతాయి

3 నెలల క్రితమే...



నేను మూడు నెలల క్రితం కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తీసుకున్నా. తరువాత నేను సొంతంగా 3 కిలోల విత్తనాన్ని తెచ్చి ట్రైయిల్ రన్ కింద పుట్టగొడుగుల సాగు చేసి దిగుబడి తీశాను. దిగుబడి ఒక మాదిరిగా వచ్చింది. త్వరలో మరో 20 కేజీల విత్తనాన్ని తెచ్చి సాగు చేస్తా. – లీలా లక్ష్మిదేవి, జోగిరెడ్డిగారిపల్లె, బద్వేల్

సాగు ప్రారంభించాను



నేను ఇటీవలే కేవీకేలో శిక్షణ తీసుకున్నా. తరువాత విత్తనాలను తెచ్చి పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రారంభించాను. 20 కిలోల సాగుకు రూ. 3 వేల నుంచి రూ.4 వేల దాకా ఖర్చు వచ్చింది. ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైంది. కిలో రూ. 250 నుంచి రూ. 300 దాకా ధర ఉంది. ఇక ఎంత రాబడి వస్తుందో చూడాలి. – ఎ.శ్రీనివాసులు, మాధవరం, ఒంటిమిట్ట మండలం

ఉపాధి కల్పించడమే లక్ష్యం



నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. శిక్షణ ద్వారా వారిలో నైపుణ్యం పెంపొందిస్తున్నాం. పుట్టగొడుగుల పెంపకంపై పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చి వారికి సహాయ సహకారం అందిస్తున్నాం. శిక్షణ పొందిన వారు పుట్టగొడుగుల పెంపకాన్ని నిర్వహించుకుంటూ ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. – డాక్టర్ శిల్పకళ, సైంటిస్టు, కేవీకే, కడప

స్వయం ఉపాధిని కల్పించే దిశగా...



ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా కేవీకేలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ శిక్షణ ద్వారా వారికి కావాల్సిన నైపుణ్యాలతోపాటు మెలకువలను మా శాస్త్రవేత్తలు నేర్పిస్తున్నారు. శిక్షణ పొందిన వారు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నారు. – డాక్టర్ వీరయ్య, కో ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు, కడప



క్లుప్తంగా

నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు

రైల్వేకోడూరు అర్బన్: మద్యం షాపులు దక్కించుకొన్నవారు ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు జరపాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ మధుసూధన్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మద్యం దుకాణం దరఖాస్తుదారులతో సమావేశమై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 111 ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. ఇందులో 69 షాపులకు 231 దరఖాస్తులు ఇంతవరకు వచ్చాయన్నారు. షాపులు దక్కించుకొన్న వారు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించుకోవాలని తెలిపారు. ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11 తేదీ వేలం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ టీకే తులసి, అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న బలరామయ్య


వీరబల్లి : మండలంలోని సానిపాయి పంచాయతీ, వంటిల్లు వద్ద నేతి పిచ్చోళ్ల బలరామయ్య(65) తన నివాసంలో శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. బలరామయ్యకు ముగ్గురు కుమారులు, భార్య ఉన్నారు. ఒక కుమారుడు హైదరాబాదులో ఉండగా, మిగతా ఇద్దరూ తిరుపతిలో నివాసం ఉంటున్నారు. మృతుని భార్య తిరుపతిలో ఉండగా బలరామయ్య ఎవరి వద్దకు వెళ్లకుండా సానిపాయిలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్టుకు ఉరివేసుకుని..

పుల్లంపేట : పుల్లంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వెంకటస్వామి (67) ఆదివారం తెల్లవారుజామున చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పుల్లంపేట ఎస్‌ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

హార్సిలీహిల్స్ వస్తున్నారా.. జేబుకు చిల్లే!

- బైక్‌కు రుసుము రూ.50
- పెంచిన టోల్ భారంపై పర్యాటకుల్లో ఆగ్రహం
- నిధులున్నా అభివృద్ధి లేదు



బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను వీక్షించేందుకు వచ్చే సందర్శకులు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఏడేళ్ల క్రితం వరకు బైక్‌కు రూ.10 వసూలు చేసేవారు. ఇప్పుడు ఏకంగా రూ.50 పెంచేయడంపై సాధారణ సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతనెల 30న టోల్‌గేటు ఎంట్రీ ఫీజు వసూలుకు నిర్వహించే వేలం పాటల్లో రుసుమును పెంచనున్నట్టు సాక్షి ముందే చెప్పింది. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేలం పాటలో టూ వీలర్‌కు ఉన్న రూ.25 ఎంట్రీ ఫీజును వందశాతం పెంచి రూ.50 చేశారు. దీంతో వేలం పాటదారులు పాటలో పాల్గొన్నప్పటికి ఏడాది లీజుకు రూ.45.25 లక్షలకు పాడతారని ఎవరూ ఊహించలేదు. మదనపల్లెకు చెందిన వ్యక్తి పాటను దక్కించుకున్నారు. అయితే పెంచిన రుసుము వసూలు అంత సులువైన పనికాదు. పెంచిన రుసుము ఇచ్చేందుకు సందర్శకులు ఒకటికి పదిసార్లు ఆలోచించి ఇచ్చే పరిస్థితి వస్తుంది. రూ.25 ఇచ్చేందుకే అంగీకరించని సందర్శకులు ఎన్నోసార్లు నిర్వాహకులతో గొడవలకు దిగారు. ఇప్పుడు ద్విచక్రవాహనదారులు రూ.50 ఇస్తారో లేక హార్సిలీహిల్స్ వెళ్లడం ఎందుకులే అనుకుంటారో చూడాలి. రుసుము వసూలుపై మళ్లీ వడ్డిస్తున్నారని గతనెల 30న సాక్షిలో ప్రచురితమైన కథనం నిజమైంది. 2022లో రూ.26.85 లక్షలు పలికిన వేలంపాట, 2023లో రూ.27.35 లక్షలు పలికింది. ఇప్పుడు దీనికి రూ.17.9 లక్షలు అదనంగా పలికింది. టౌన్‌షిప్ కమిటీకి ఆదాయం లభించినప్పటికి సందర్శకులకు చెల్లింపు ఇబ్బందికరంగా మారుతుంది.

20 ఏళ్లుగా వసూళ్లు

హార్సిలీహిల్స్ వెళ్లే సందర్శకుల నుంచి సుమారు 20 ఏళ్లుగా టోల్ వసూలు చేస్తున్నారు. గతంలో పనిచేసిన సబ్‌కలెక్టర్ జాహ్నవి ఎంట్రీ ఫీజు వసూలుకు వేలం పాటలను తొలిసారి నిర్వహించారు. అప్పటివరకు వీఆర్‌ఏలకు రుసుము వసూలు బాధ్యతలను అప్పగించగా వారు మోసానికి పాల్పడినట్టు నిర్ధారించి విధుల నుంచి తొలగించారు. నకిలీ టికెట్లతో రుసుము స్వాహా చేసినట్టు సబ్‌కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. దీంతో వేలం ద్వారా ప్రైవేటు వ్యక్తులకు వసూలు బాధ్యతలను అప్పగిస్తూ వస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై పలు విమర్శలు వచ్చినా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోలేదు.

ఎంతుందో తెలియదు

హార్సిలీహిల్స్ టోల్ ద్వారా వసూలు చేస్తున్న ఎంట్రీఫీజు సొమ్ము లక్షలకు చేరింది. మూడేళ్లకే రూ.66.21 లక్షల ఆదాయం వచ్చింది. అంతకు మునుపు నుంచే వసూలు చేస్తున్న సొమ్ము భారీగా ఉండాలి. ఈ నిధులు మొత్తం ఎంత ఉన్నదీ తెలియదు. అయితే గత ఆర్డీఓ మురళీ హార్సిలీహిల్స్‌పై హైమాస్ లైట్లను ఈ నిధుల నుంచే ఖర్చు చేసి వేయించినట్టు తెలుస్తోంది. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ పరిధిలో టోల్‌ను వసూలు చేస్తున్నప్పటికి ఈ నిధులతో హార్సిలీహిల్స్ అభివృద్ధికి చేసిన ఖర్చు ఇప్పటి వరకు ఏమీ లేదంటే ఆశ్చర్యపోవాల్సిందే.

వడ్డిస్తున్న రుసుము

వాహనం	2021	2022	2024
బైక్	రూ.20	రూ.25	రూ.50
త్రీ వీలర్	రూ.60	రూ.75	రూ.70
కార్లు	రూ.70	రూ.100	రూ.100
బస్సు	రూ.120	రూ.170	రూ.200

ఘరానా దొంగ అరెస్టు

- రూ.7లక్షలు విలువ చేసే బంగారు, నగదు స్వాధీనం
- పలు జిల్లాల్లో 44 కేసుల్లో కీలక నిందితుడు
- నిందితుడు కృష్ణాజిల్లా గుడివాడ వాసిగా గుర్తింపు
- రెండేళ్ల నుంచి తప్పించుకొని తిరుగుతూ..
- ఎట్టకేలకు రాజంపేట చోరీ కేసులో పట్టివేత


ఘరానా దొంగ అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్

రాజంపేట : రాజంపేటలో ఇటీవల జరిగిన దొంగతనాలకు సంబంధించి ఓ ఘరానా దొంగను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.6,93,800 విలువ చేసే బంగారు, రూ.9,650 నగదు స్వాధీనం చేసుకున్నారు. వేములపల్లి విజయకుమార్ అనే ఘరానా దొంగ స్వస్థలం కృష్ణా జిల్లా గుడివాడలోని రామాలయం వీధి, మండపాడుగా గుర్తించారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా వెంకటగిరిలోని పల్లంపేటలో నివాసముంటున్నాడు. పలు జిల్లాల్లో 44 కేసుల్లో కీలక నిందితుడు. కొన్ని కేసుల్లో శిక్ష పడగా, మరికొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దొంగపై సామర్లకోట, రాజమండ్రి, అనపర్తి, తాడేపల్లిగూడెం, ద్వారాకా తిరుమలలో చోరీ కేసులు నమోదయ్యాయి.

రెండేళ్ల నుంచి తప్పించుకుంటూ..

దొంగ విజయకుమార్ రెండేళ్ల నుంచి ఎవరికి దొరకుండా రాత్రి వేళల్లో దొంగతనాలు చేస్తూ వస్తున్నాడు. కాగా ఈ రెండేళ్లలో 11 దొంగతనాలు చేశాడు. రాజంపేట పట్టణంలోని కొప్పు నాగరాజు ఇంటిలోకి తాళాలు తీసుకొని లోపలికి ప్రవేశించాడు. డూప్లెక్స్ ఇల్లు కనుక పై భాగంలో నాగరాజు దంపతులు ఉన్నారు. కిటికీలో నుంచి తాళం చెవి తీసుకొని, ఇంటి తాళాలు తీసి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ కేసులో విజయకుమార్‌ను డీఎస్పీ సుధాకర్ పర్యవేక్షణలో సీఐ యల్లమరాజు, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి పట్టుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు వీలైనంతవరకు వారి ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా పోలీసు పెట్రోలింగ్ ద్వారా నిఘా ఉంచుతామన్నారు.

ఆస్పియా హంతకులను కఠినంగా శిక్షించాలి



రాయచోటిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు

రాయచోటి అర్బన్ : పుంగనూరు పట్టణానికి చెందిన ఆరేళ్ల బాలిక ఆస్పియా హత్యకేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని పట్టణ ముస్లిం మైనార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఆస్పియా అదృశ్యమైన తరువాత శవమై నీటిలో తేలియాడిన దుర్ఘటనకు నిరసనగా పైగం-ఏ-ఆమన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ ఆఫ్తాబ్, కో-కన్వీనర్ ఎం.నిజాంఖాన్‌లు మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి ఆస్పియాను గుర్తు తెలియని దుండగులు అపహరించి, హత్యచేసి సమీపంలోని చెరువులో పడేయడం దారుణమన్నారు. మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు నాసర్, మన్సూర్, ఆరీఫ్, గోల్డ్ అమీర్‌జాన్, మహమ్మద్‌అలీ, ముక్తియార్, అత్తావుల్లా, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


మాట్లాడుతున్న యమల సుదర్శనం

రాయచోటి అర్బన్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం తెలిపారు. మాలల ధర్మ యుద్ధ సభలో భాగంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ఎన్‌జీఓ హోం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జీఓ సభా భవనంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 2024 ఆగస్టులో వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒకవేళ వర్గీకరణ చేయాలంటే దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ఏకగ్రీవ తీర్మానాలు చేయాలని, దాన్ని పార్లమెంటులో 2/3వ వంతు మెజార్టీతో ఆమోదించాల్సి ఉందన్నారు. వర్గీకరణను దేశంలోని నాలుగు మినహా మిగిలిన రాష్ట్రాలన్ని వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇదే సమయంలో జాతీయ ఎస్సీ కమిషన్ సైతం వర్గీకరణకు ఆమోదం తెలపాలన్నారు. రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం కాని, ఆర్టికల్ 14, 16 ప్రకారం కాని వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అన్నారు. కార్యక్రమంలో మహానాడు జాతీయ అధ్యక్షుడు గద్దం నాగముని, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకటయ్య, ఉపాధ్యక్షుడు లింగం సంజీవ్, రాష్ట్ర నేత ధరణి, రాయలసీమ కన్వీనర్ యమల చంద్రయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి హరి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు గొప్పదా...'సుప్రీం' గొప్పదా!

- ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ ఉల్లంఘన
- 'కల్తీ నెయ్యి'లో జగన్‌ను ఇరికించాలని చూసి తానే ఇరుక్కున్న చంద్రబాబు
- వంద రోజుల టీడీపీ కూటమి పాలన ఘోరంగా విఫలమైంది
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ హర్షకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఎంపీ హర్షకుమార్ అన్నారు. అలాగే చట్టాలను చేసే పార్లమెంటు గొప్పదా? సుప్రీం కోర్టు గొప్పదా అనే అంశాన్ని తేల్చాలని తెలిపారు. ఆదివారం వైఎస్సార్‌జిల్లా కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై మాల సామాజిక వర్గానికి చెందిన వారు వేసిన రివ్యూ పిటీషన్‌ను న్యాయస్థానం కొట్టివేసిందనారు. ఎస్సీ వర్గీకరణ 341 ఆర్టికల్‌కు వ్యతిరేకమన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగాలంటే 341 ఆర్టికల్‌ను సవరణ చేయాల్సి ఉంటుందన్నారు. చట్టాలు పార్లమెంటు ద్వారా ఆమోదం పొందుతాయన్నారు. ఈ అంశం పార్లమెంటులోనే తేల్చాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి పార్లమెంటు గొప్పదా? సుప్రీం కోర్టు గొప్పదా అనే సంగతిని తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే సీతాకాల సమావేశాల్లో 341 ఆర్టికల్‌పై చర్చ జరగకపోతే ఛలో పార్లమెంటుకు పిలుపునిస్తామని హెచ్చరించారు. అలాగే తాను ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పవిత్ర తిరుమల-తిరుపతి దేవస్థానం తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిని వాడారని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు గగ్గోలు పెట్టడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ నెయ్యి అంశానికి సంబంధించి సిట్‌ను వేస్తే న్యాయస్థానం సీబీఐని నియమించడం హర్షణీయమన్నారు. కల్తీ లడ్డూ విషయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇరిగించాలని చూసిన చంద్రబాబు అందులోనే తాను చిత్తయ్యారని అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్నాయని తెలిపారు. సనాతన ధర్మం అంటే వర్ణవివక్షతో కూడుకున్నదా? అని ప్రశ్నించారు. వంద రోజుల పాలన పూర్తిగా వైఫల్యం కావడంతో చంద్రబాబునాయుడు కల్తీ లడ్డూ, పవన్ కల్యాణ్‌ను సనాతన ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చి ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలపై దాడులు జరుగుతున్నాయని గత ప్రభుత్వ పాలనలో కొన్ని మీడియా సంస్థలు గగ్గోలు పెట్టాయని గుర్తు చేశారు. మరీ టీడీపీ కూటమి పాలనలో దాడులు జరుగుతుంటే ఆ మీడియా సంస్థలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను వెతికి వెతికి పట్టుకున్న పోలీసులు ఎస్సీ ఎస్టీ మైనార్టీలపై దాడులకు పాల్పడుతున్న వారిని ఎందుకు పట్టుకోవడం లేదని నిలదీశారు.

నేను పక్కా టీడీపీ..ఎవడికైనా చెప్పుకో!

- టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత రేవూరి వేణుగోపాల్ బెదిరింపు
- నిస్సహాయస్థితిలో బాధితుడు
- రాజంపేటలో వైరల్ అయిన వీడియో


డీబీఎస్ పల్లెలో బాధితున్ని బెదిరిస్తున్న టీఎన్‌ఎస్‌ఎఫ్ నేతగా చెప్పుకుంటున్న రేవూరి వేణుగోపాల్

రాజంపేట : రాజంపేటలో అక్రమ వడ్డీ వ్యాపారంతో పచ్చ జలగల అరాచకం పెట్రేగిపోతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను అధిక వడ్డీలతో జలగల్లా పచ్చ మాఫియా పీల్చి పిప్పి చేస్తోంది. దీంతో బాధితులు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా పట్టణంలోని డీబీఎస్‌పల్లెలో నేను పక్కా టీడీపీ.. ఎవడికైనా చెప్పుకో.. అంటూ ఓ వ్యక్తి కాల్‌మనీ దందా చేసిన వీడియో ఒకటి ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. టీఎస్ఎస్ఎఫ్ నేత నంటూ బాధితులను బెదిరించాడు. నిస్సహాయ స్థితిలో బాధితుడు ఉండిపోయాడు.

టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడినంటూ..

టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడినని చెప్పుకునే రేవూరు వేణుగోపాల్ అనే వ్యక్తి డీబీఎస్ పల్లెలో ఓ వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లి దౌర్జన్యంగా వ్యవహరించిన సంఘటనకు సంబంధించిన వీడియో అధికార పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. తాకట్టు పెట్టిన ఇంటికి వడ్డీ డబ్బులతో సహా అప్పు చెల్లిస్తానన్నా బాండ్ ఇవ్వనని గదమాయించాడు. వడ్డీకి వడ్డీ రూపంలో పేదల రక్తం పీలుస్తున్న ఈ నాయకుడు ఓ వ్యక్తికి డబ్బు రూ.80వేలు అప్పుగా ఇచ్చాడు. బాండు రూ.1.50 లక్షకు రాసుకున్నాడు. ప్రతి నెల వడ్డీ చెల్లించాలని షరతు విధించాడు. తారీఖు దాటితే సరి వడ్డీకి వడ్డీ వేసి వసూలు చేస్తాడని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇతని అరాచకానికి ఆకేపాడులో ఒకరు బలైనట్లు బాధిత వర్గాల నుంచి వినిపిస్తోంది. అయితే ఈ సంఘటనపై పోలీసులకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందలూరు హరిజనవాడకు చెందిన రేవూరి వేణుగోపాల్ స్పందిస్తూ డీబీఎస్‌పల్లెలో జరిగిన సంఘటన తనకు సంబంధంలేదని, అందరు తనను అనుకుంటున్నారని, ఆయన పేరు కూడా రేవూరి వేణుగోపాల్ అని సోషల్ మీడియా ద్వారా చెప్పుకోవడం గమనార్హం.

ధర్మవరం టు ప్రొద్దుటూరు

- ప్రొద్దుటూరు కమిషనర్‌గా మల్లికార్జున
- మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మధ్య వివాదమే కారణం



ప్రొద్దుటూరు : ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునను ఉన్నతాధికారులు ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. సోమవారం ఉదయం కమిషనర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ధర్మవరం నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య వివాదంతోనే కమిషనర్‌ను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిస్తున్న జి.రఘునాథరెడ్డిని బాపట్లకు బదిలీ చేశారు.

కమిషనర్ రాకను అడ్డుకున్న టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ప్రొద్దుటూరు వాసి మంత్రి సత్యకుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన ఆదేశాల ప్రకారమే మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఇటీవల నియమించారు. కమిషనర్ రాకను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పూర్తిగా వ్యతిరేకించారు. పరిటాల శ్రీరామ్‌తోపాటు ఆయన వర్గీయులు కమిషనర్‌పై అవినీతి ఆరోపణలు చేయడంతోపాటు కమిషనర్‌ను కార్యాలయానికి రాకుండా అడ్డుకున్నారు. గత కొద్ది రోజులుగా కమిషనర్ అక్కడ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లకుండా ఇంటిలో నుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ కోరిక మేరకు మంత్రి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో చర్చించి ఇక్కడికి బదిలీ చేయించారు. కొసమెరుపు ఏమిటంటే గతంలో కొద్ది రోజులు మాత్రమే ప్రొద్దుటూరులో సదరు కమిషనర్ పనిచేసి వెళ్లిపోయారు.

తప్పిపోయిన బాలుడి మృతదేహం లభ్యం


అమర్ (ఫైల్)


కేసీ కాలువలో బాలుడి మృతదేహం

దువ్వూరు : ఈనెల 3వ తేదీన తప్పిపోయిన బాలుడి శవమై కనిపించాడు. వివరాలు ఇలా.. దువ్వూరుకు చెందిన తంగెడుపల్లె సాయికుమార్, ప్రసన్న దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిన్న కుమారుడు అమర్ ఈనెల 3న గురువారం తప్పిపోయాడు. ఈ విషయంపై శనివారం పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. చాపాడు మండలం మొరాయిపల్లె సమీపంలో కేసీ కెనాల్‌లో ఆదివారం ఉదయం బాలుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు అమర్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.


అమ్మవారి సేవలో జ్యుడిషియల్ మెజిస్ట్రేట్


రేణుకా యల్లమాంబను దర్శించుకున్న పసుపులేటి శంకర్

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా యల్లమాంబను రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ ఆదివారం సాయంత్రం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాలతో అర్చకుడు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేయాలన్నారు.

స్వర్ణకుమారి అదృశ్యం గుట్టు వీడేనా.?

- ఎనిమిదిరోజులైనా లభించని సీఐ తల్లి ఆచూకీ
- ఇంటిముందు వ్యక్తిపై పోలీసుల అనుమానం
- ప్రైవేట్ ఫైనాన్స్‌లో బాధితురాలి నగలు
- పోలీసుల అదుపులో అనుమానితులు


స్వర్ణకుమారి (ఫైల్)

మదనపల్లి : మదనపల్లెలో మహిళ అదృశ్యం కేసు.. దృశ్యం సినిమాలో పోలీస్ ఆఫీసర్ కుమారుడి మిస్సింగ్ కేసులా రోజుకో మలుపు తిరుగుతోంది. బాధితురాలి ఫోన్ ఒకో సమయానికి ఒకో టవర్ లొకేషన్ చూపిస్తూ, పోలీసులను ముప్పుతిప్పలు పెడుతూ సినిమాలోని సన్నివేశాలను గుర్తుకు తెస్తోంది. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి అదృశ్యం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. బాధితురాలు కనిపించకుండా పోయి ఎనిమిదిరోజులు అవుతున్నప్పటికీ, ఇటు బాధితురాలు, అటు నిందితుడి ఆచూకీ రెండూ లభ్యం కాలేదు. అదృశ్యమైన మహిళ స్వయానా ఓ పోలీస్ అధికారికి తల్లి కావడంతో, పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ తల్లి ఆచూకీ కోసం తాలూకా సీఐ కళావెంకటరమణ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. బాధితురాలికి చెందిన నగలు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఆమె ఇంటి ముందు నివాసం ఉంటున్న కారు డ్రైవర్ వెంకటేష్ కుదువ పెట్టినట్లు తేలడంతో, అతడిని ప్రధాన నిందితుడిగా అనుమానిస్తూ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో అతడికి సహకరించాడనే అనుమానంపై పట్టణానికి చెందిన ఓ యువకుడితో పాటు మరి కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు..

పట్టణశి వారు ప్రాంతమైన వైఎస్ జగన్ కాలనీలో ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి(62) ఒంటరిగా నివసిస్తోంది. ఆమెకు దైవభక్తి ఎక్కువ. స్థానికులతో పెద్దగా కలిసేది కాదు. ఇటీవల ఆమె ఉంటున్న ఇంటి ఎదురుగా పరిచయమున్న వ్యక్తులు అద్దెకు దిగారు. ఒకే ఊరు వారు కావడంతో ఏ అవసరం వచ్చినా, వారిని కలవడం, వారితో కలిసి బయటకు వెళ్లడం చేసేది. ఈ క్రమంలో సెప్టెంబర్ 28న బసినికొండలో ఆలయానికి ఎదురింట్లో ఉంటున్న వెంకటేష్‌తో కలిసి ఉదయం వెళ్లింది. మధ్యాహ్నం ఆమె స్నేహితురాలు స్వర్ణకుమారికి ఫోన్ చేస్తే కాల్ ఫార్వర్డ్ వాయిస్ వినిపించింది. సాయంత్రమైనప్పటికీ స్వర్ణకుమారి ఇంటికి చేరుకోలేదు. తెలిసిన వారితో బయటి ప్రాంతాల్లోని గుడికి వెళ్లిందేమోనని స్థానికులు భావించారు. కాగా, అక్టోబర్ 1న పెన్షన్ తీసుకునేందుకు స్వర్ణకుమారి రాకపోవడంతో స్థానికులు సమాచారాన్ని కుమారుడైన సీఐ నాగేంద్రప్రసాద్‌కు తెలిపారు. దీంతో ఆయన మదనపల్లెకు చేరుకుని స్థానికంగా తల్లి ఆచూకీ కోసం విచారించారు. మూడురోజులైనా ఆచూకీ లభించకపోవడంతో, అక్టోబర్ 2న తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కళావెంకటరమణ మహిళ అదృశ్యంగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందులో భాగంగా స్వర్ణకుమారి అదృశ్యమైన సెప్టెంబర్ 28, శనివారంరోజు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో రూ.4లక్షలకు నగలు తాకట్టు పెట్టినట్లుగా పోలీసులు గుర్తించారు. అలాగే అదృశ్యమైన రోజు, మరుసటిరోజు వెంకటేష్ ఏమీ తెలియనట్లుగా ఇంటివద్దనే ఉంటూ స్థానికులకు కనిపించాడు. ఎప్పుడైతే పోలీసుల విచారణ మొదలైందో.. తాను వాడుతున్న ఫోన్‌ను ఇంటివద్దే వదిలి పరారయ్యాడు. కర్నాటకలో నిందితుడు తలదాచుకున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఇదిలాఉంటే బాధితురాలు స్వర్ణకుమారి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, టవర్ లొకేషన్ ఒకో సమయానికి ఒకో ప్రాంతం చూపిస్తుండటం, ప్రధాన నిందితుడి ఆచూకీ లభించకపోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. స్వర్ణకుమారి అదృశ్యం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఎనిమిదిరోజులైనా స్వర్ణకుమారి ఆచూకీ లభించకపోవడంతో.. పుంగనూరు ఘటనలో బాలిక కేసులో మాదిరిగానే ఏ వార్త వినాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.